మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 | సంచిక 172 | శనివారం 24 మే 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-



# మీది 40 ఏళ్ల అనుభవం..

## మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తాం..

- ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రండి
- మీ 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని చెప్పండి
- పదవి ఉంటేనే వస్తా అంటే ఎలా?
- మేము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నాము
- ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాడాలి
- ఏ రోజు నేను సీఎంగా అహంకారానికి పోలేదు
- మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తాం

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

**ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీ 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని మాకు చెప్పండని కోరారు. పదవి ఉంటేనే వస్తా అంటే ఎలా? అని ప్రశ్నించారు. మేము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నామని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాడాలని హితవు పలికారు. ఏ రోజు తాను సీఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామని.. ప్రపంచంలో తెలంగాణని గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.**

రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాని 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. భూమి లేని రైతులకు కూడా సహాయం అందిస్తున్నామని తెలిపారు.. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి సీఎం అన్నారని.. కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు కేటాయించామని.. కోటి మంది మహిళలను కోటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు.. మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్పూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు.

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ముందున్న అన్న వ్యక్తి ఇంట్లో మాత్రం అందరికి ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని.. మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు.

రాష్ట్రానికి రావాల్సిన నిధులు కోసం ప్రధాని మోడీని ఎన్ని సార్లు అయిన కలుస్తామని స్పష్టం చేశారు. చెరువు మీద అలిగితే మనకే వాసన వస్తుందని.. ఒకాయన అలాగే అలిగి ఫామ్ హౌస్ లో పడుకున్నారని తీవ్రంగా విమర్శించారు. నేను మీ కోసం పని చేస్తా.. కష్టపడుతానన్నారు.



## ఎన్నిసార్లైనా మోదీని కలుస్తాం..

- నిధులు రాబడతాం..
- తెలంగాణను అభివృద్ధి చేస్తాం..

ఎన్నికలప్పుడే రాజకీయాలని.. తర్వాత అందరిని కలుపుకొని పోయి.. రాష్ట్ర అభివృద్ధికి ... ప్రజాసంక్షేమానికి పాటుపడతామని పస్తాపూర్ సభలో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధుల కోసం ఎన్నిసార్లైనా ప్రధాని మోదీని కలుస్తామని.. తెలంగాణకు అవసరమైన ఫండ్స్ తీసుకొస్తామంటూ.... . చెరువు మీద అలిగితే వాసన మనకే కదా అంటూ.. ఒకాయన ఫాంహౌస్ లో పడుకున్నారన్నారు. నేను మీ కోస్ పనిచేస్తా.. కష్టపడతానని సీఎం రేవంత్ అన్నారు.

## కవిత మరో షర్మిల కాబోతోంది.. ఎంపీ రఘునందన్



- కవిత కాంగ్రెస్‌లోకి వెళ్లారని జోస్యం
- కేసీఆర్ కుటుంబంలో వారసత్వ పోరాటం మొదలైంది: రఘునందన్ వ్యాఖ్యలు
- తెలంగాణలో అధికారంలోకి రాబోయేది బీజేపీయే - ఎంపీ రఘునందన్

## మా నాయకుడు కేసీఆరే

- కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాల వల్ల పార్టీకి నష్టం: ఎమ్మెల్సీ కవిత



'మా నాయకుడు కేసీఆర్ .. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది' అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న ఆమెకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో జాగృతి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.

# కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారింది..



- ఈడీ చార్జ్‌షీట్‌లోనే సీఎం అవినీతి బయటపడింది
- వందల కోట్ల అవినీతి.. వేల కోట్ల దోపిడీ
- చీఫ్ మినిస్టర్ పదవిని అవినీతికి అడ్డంపెట్టుకున్న రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌లో తిరుగుబాట్ల వణుకు.. సీఎం కుర్చీ దెబ్బతినే రోజులు దగ్గరే!
- 30 శాతం కమీషన్ లేక ఫైలు కదలదు: కాంగ్రెస్ ఎమ్మెల్యే మాటలతో నిజం వెలుగు చూసింది
- 'స్కాంగ్రెస్‌కు ధర్మయుద్ధం తప్పదు!' - కేటీఆర్ వ్యాఖ్యలు

తెలంగాణా రాష్ట్రం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం స్థితిలోకి మారిపోయిందని, ఇది ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా ఒప్పుకుంటున్న విషయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎక్స్ వేదికగా కేటీఆర్.. తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు స్కాంగ్రెస్.. కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం గా మారింది. ఈడి లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా ఇదే చెబుతున్నాయి. తెలంగాణ బ్యాగ్ మ్యాన్ రేవంత్ రెడ్డి పేరును ఈడి తన చార్జ్ షీట్ లో నమోదు చేసింది.. తన పేరు ఈడి చార్జిషీట్‌లో రావడంతో రేవంత్ రెడ్డి టెన్షన్ డైవర్షన్ డ్రామాలు మొదలుపెట్టాడన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ప్రతిరోజూ కొత్త నాటకాలు చేస్తున్నాడని, తన అవినీతిని చర్చించకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈడీ చార్జిషీట్ లో రేవంత్ రెడ్డి పేరు వచ్చిన తర్వాత అయినా కేంద్రం చర్యలు తీసుకుంటుందా లేదా? అని ఆయన ప్రశ్నించారు

## మిస్ వరల్డ్ పోటీలు.. హెడ్-టు-హెడ్ ఛాలెంజ్ విన్నర్స్ వీరే..

- మిస్ ఇండియా నందిని గుప్తాకు దక్కని అవకాశం
- యూరప్, ఆఫ్రికా, ఆసియా, అమెరికా అండ్ కరేబియన్ ఖండాల నుంచి 20 మంది కంటెస్టెంట్స్
- ఈ నెల 31న గ్రాండ్ ఫినాలే

2 లో

## పాకిస్తాన్ అన్ని షరతులను అంగీకరించాకే రుణమిచ్చాం: ఐఎంఎఫ్

2 లో



## గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

### కవిత లేఖపై మంత్రి పొన్నం

కాంగ్రెస్ ఆరోపణలకు బలం చేకూర్చేలా ఎమ్మెల్సీ కవిత లేఖ ఉందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ లో నేడు మీడియాతో మాట్లాడుతూ ఏనాడు బీజేపీ , బీఆర్ఎస్ పార్టీలు వేరు కాదనే విషయం మరోసారి వెలుగులోకి వచ్చిందని అన్నారు. ఆ రెండు పార్టీల వ్యవహారం గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ అన్న చందంగా ఉందని మండిపడ్డారు. బీజేపీ ఎందుకు బీఆర్ఎస్ ను ప్రశ్నించడం లేదని కాంగ్రెస్ ప్రశ్నిస్తే.. రాజకీయం అన్నారని.. ఇప్పుడు అదే విషయంలో కేసీఆర్ కూతురే అడుగుతుందని, దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

## నేటి మాట

పాలకుడు అవినీతి పరుడైతే నీతిమంతులు జైలు పాలవుతారు..



-ఫిడేల్ కాస్ట్రో



## రక్షణ పరిశోధన ,అభివృద్ధి సంస్థలను ఏపీలో ఏర్పాటు చేయండి

- ఏపీలో DRDO ఉత్కృష్టతా కేంద్రాలు ఏర్పాటు చేయండి
- రాజ్‌నాథ్‌ను కలిసిన చంద్రబాబు - ఆంధ్రప్రదేశ్‌ను డిఫెన్స్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలు
- యువతకు ఉపాధి - దేశానికి భద్రత
- రాజ్‌నాథ్ సానుకూల స్పందన - ఏపీ లో రక్షణ రంగ అభివృద్ధికి కేంద్ర హామీ
- ఆధునిక మౌలిక సదుపాయాలతో ఏపీని రక్షణ రంగానికి హబ్‌గా మార్చుతాం: చంద్రబాబు

## బీఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతం..



- వంద జాకీలు పెట్టినా లేచే పరిస్థితి లేదు
- బీఆర్ఎస్ సభలో రాజు, యువరాజుల ఫొటోలు తప్ప మిగతా నాయకులెవ్వరివి లేవు
- కవిత లేఖ జోక్ లా మారింది - తండ్రికి లేఖ రాయడం ఏ రకం రాజకీయం
- కాళేశ్వరం అనుబంధ ప్రాజెక్టులు విఫలం.. 3 డ్యామ్‌లను తొలగించాలి
- బీజేపీకి బీఆర్ఎస్ ఓట్లు.. అభ్యర్థి లేక చంద్రుడిలా మిగిలిన పార్టీ
- ఇప్పుడెవ్వరూ బీఆర్ఎస్ గురించి ఆలోచించట్లేదు! - మంత్రి కోమటిరెడ్డి

మన క్రాంతి KR TV ఇది వాస్తవ పత్రిక...



# మీది 40 ఏళ్ల అనుభవం.. మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తాం..

మొదటి పేజీ తరువాయి

అలాగే సీఎం రేవంత్‌రెడ్డి జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. "జగ్గారెడ్డి భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తారు. వారికి ఇళ్ల పట్టాలు అందించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పజెబుతున్నా. వారికి మంచి భోజనం పెట్టించి జగ్గారెడ్డి పట్టాలు ఇస్తారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు..ఆ తర్వాత అభివృద్ధి మన అజెండా. సంజీవ రెడ్డి, సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ కి రెండు కళ్ళలాంటి వారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం. BHEL, BDL, NIMZ, ఇక్రిశాట్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే.. సింగూరు నుంచి మంజీరా జలాలు హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మారుస్తాం." అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

# తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మారింది..

మొదటి పేజీ తరువాయి

అమృత్ స్కాం, ఆర్ఆర్ టాక్స్ స్కాం, సివిల్ సప్లై స్కాం వంటి వాటిలో ఇంతకుముందు వదిలేసినట్లుగా వదిలేస్తుందా అన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారిందన్నారు కేటీఆర్. అంతేకాకుండా..'నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు పెట్టడంతో.. సీఎం అవినీతి బండారం మొత్తం బయటపడింది. యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తానని రేవంత్ రెడ్డి ప్రలోభ పెట్టాడని ఈడీ నమోదు చేసిన చార్జిషీట్ తో సీఎం అవినీతి సామ్రాజ్యం బట్టబయలైంది. అధికారం కోసం ముఖ్యమంత్రి కాకముందే కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వందల కోట్లు కట్టబెట్టిన వ్యవహారం కుండబద్దలు కొట్టినట్టయింది. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం గత ఏడాదిన్నరలో సీఎం పదవిని అడ్డం పెట్టుకుని ఏకంగా వేల కోట్లకు చేరింది. దివ్యమైన తెలంగాణని దివాళా తీసి వేల కోట్లు కొల్లగొట్టడం వల్లే ఈడీ కేసులో రేవంత్ రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి – పొంగులేటి తరహాలో చీకట్లో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటాడా ?? ఈడీ, కేవలం చార్జిషీటులో పేరు పెట్టడం వరకే పరిమితం అవుతుందా ? లేక రేవంత్ రెడ్డిని విచారణను పిలిచి మొత్తం అవినీతి కుంభకోణాలను కక్కిస్తుందా ?? రాష్ట్ర కాంగ్రెస్ లో రోజురోజుకూ పేట్రేగిపోతున్న అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కకావికలమైంది. పెరిగిపోతున్న తిరుగుబాట్లతో సీఎం కుర్చీ ఎప్పుడూ కూలిపోతుందో అనే భయం రేవంత్ రెడ్డిని అడుగడుగునా వెంటాడుతోంది. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి.. అటెన్షన్ డైవర్షన్ కోసం రోజురోజుకూ చేస్తున్న చిల్లర చేష్టలు, కొత్త కుట్రలకు తెరపడినట్టే. సీఎం రేవంత్ కు పిల్లనిచ్చిన మామ సూదిని పద్మారెడ్డియే స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరగలేదనడంతో ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు ఒక్కసారిగా ఎగిరిపోయినై.. కమీషన్లు లేనిదే ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్క ఫైలు కదలడం లేదని స్వయంగా కేబినెట్ మంత్రి కొండా సురేఖ కుండబద్దలు కొట్టడంతో కాంగ్రెస్ నిర్వాకాలన్నీ వరుసగా వెలుగుచూస్తున్నాయి. 30 శాతం పర్సెంటేజీలు ఇవ్వనిదే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆ పార్టీ బట్టలిప్పడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది. నాలుగు కోట్ల ప్రజల ముందు ముఖ్యమంత్రి అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా కాంగ్రెస్ పార్టీ కొట్టుకుంటోంది. పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టడమే కాకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీచేస్తూ, పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి పాపం పండింది. చివరికి ధర్మం గెలుస్తుంది..' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# తండ్రికి లేఖ రాయడం ఏంటి? కవిత లెటర్‌పై ఎంపీ డీకే అరుణ హాట్ కామెంట్స్



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు తన కూతురు ఎమ్మెల్సీ కవిత రజతోత్సవ సభపై లేఖ రాయడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లెటర్‌పై కాంగ్రెస్, బీజేపీ నేతలు స్పందిస్తున్నారు. తాజాగా బీజేపీ ఎంపీ డీకే అరుణ స్పందించారు. శుక్రవారం డీకే అరుణ మీడియాతో మాట్లాడుతూ.. అసలు తండ్రికి లేఖ రాయడం ఏంటి? ఎప్పుడంటే అప్పుడే తండ్రిని కలిసే అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. కవితను కేసీఆర్ కలవట్లేదా? అసలు లేఖ రాయడానికి గల ఉద్దేశం ఏంటి? అని ప్రశ్నించారు. మరోవైపు అన్న చెల్లెలు మధ్య, కుటుంబంలో ఏదైనా డిఫరెన్సెస్ ఉందా? అని ప్రశ్నించారు. అసలు ఇది కవిత రాసిన లేఖనా? కాదా? నిన్నటి నుంచి లేఖ చక్కర్లు కొడుతున్న ఇప్పటివరకు దీనిపై వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఇది కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి చేసిన ఎత్తుగడ కూడా కావొచ్చని అభిప్రాయపడ్డారు.

ఎందుకంటే బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో ప్రాబల్యం తగ్గుతోందని, బీజేపీకి తెలంగాణ ప్రజలు మొగ్గు చూపుతున్నారని, ఆ పార్టీని వీక్ చేయాలని.. రెండు పార్టీలు భావిస్తున్నాయని ఆరోపించారు. గతంలోనూ బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని ఇలాంటి ఎత్తుగడనే తీసుకొచ్చారని గుర్తుకు చేశారు. బీజేపీ పార్టీని అడ్డుకోవాలనే ఈ లేఖ డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ డ్రామాలు సైతం వారికి కొత్త కాదన్నారు. లెటర్ కేసీఆర్ వరకు చేరిందా? మధ్యలోనే బయటకు వచ్చిందా అనేది కూడా తెలియాలని చెప్పుకొచ్చారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి కుట్రలు చేయడంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అభిప్రాయపడ్డారు. కాగా, తండ్రి కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ రాసినట్లు మీడియాలో చక్కర్లు కొడుతోంది. వరంగల్ సభలో కేసీఆర్ స్టేజ్ పైకి వచ్చే ముందు సీనియర్ నేతలు మాట్లాడి ఉండాల్సిందని, బీజేపీపై ఇంకా బలంగా మాట్లాడితే బాగుండేదని లేఖలో పేర్కొన్నారు. భవిష్యత్తులో బీజేపీతో కేసీఆర్ పొత్తు పెట్టుకుంటారని చాలామంది ప్రచారం చేస్తున్నారు.. నేను కూడా బీజేపీ వల్ల చాలా ఇబ్బంది పడ్డాను డాడీ.. బీజేపీని ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందేమో డాడీ.. అంటూ కవిత లేఖ రాసినట్లు ప్రచారం జరుగుతోంది.

## కవిత మరో షర్మిల కాబోతోంది.. ఎంపీ రఘునందన్

ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఇదే అంశంపై కాంగ్రెస్ , బీజేపీ నేతలు ఒక్కోక్కరు ఒక్కో విధంగా స్పందిస్తున్నారు. ఈ క్రమంలోనే కవిత లేఖపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇంతకు కవిత రాసిన లేఖ రాజకీయ పంచాయితీనా.. లేక ఆస్తుల పంచాయితీనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన నాటి నుంచి కేసీఆర్ కుటుంబంలో లుకలుకలు వచ్చాయని, ఇప్పుడు అవి వారసత్వ యుద్ధంగా పరిణామం చెందాయని కామెంట్ చేశారు.

పార్టీ నుంచి కవితను కట్టుబట్టలతో బయటకు పంపేందుకు కేటీఆర్ తో పాటు హరీశ్ రావు ఒక్కటయ్యారని ఆరోపించారు. రానున్న రోజుల్లో కవిత మరో షర్మిల కాబోతోందని ఆయన జోస్యం చెప్పారు. కవిత కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని.. ఆమె వెంట ఉండి అంతా నడిపిస్తోంది పాత బిజినెస్ పార్ట్‌నర్ సీఎం రేవంత్ రెడ్డి అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎవరు ఏం చేసినా.. తెలంగాణలో అధికారంలోకి రాబోయేది బీజేపీయేనని ఎంపీ రఘునందన్ రావు అన్నారు.

# ఎన్నిసార్లైనా మోదీని కలుస్తాం.. నిధులు రాబడతాం.. తెలంగాణను అభివృద్ధి చేస్తాం..

ఎన్నికలప్పుడే రాజకీయాలని.. తర్వాత అందరిని కలుపుకొని పోయి.. రాష్ట్ర అభివృద్ధికి ... ప్రజాసంక్షేమానికి పాటుపడతామని పస్తాపూర్ సభలో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధుల కోసం ఎన్నిసార్లైనా ప్రధాని మోదీని కలుస్తామని.. తెలంగాణకు అవసరమైన ఫండ్స్ తీసుకొస్తామంటూ.... . చెరువు మీద అలిగితే వాసన మనకే కదా అంటూ.. ఒకాయన ఫాంహౌస్ లో పడుకున్నారన్నారు. నేను మీ కోస పనిచేస్తా.. కష్టపడతానని సీఎం రేవంత్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని.. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం రూ.5 వేల కోట్లకు పైగా కేటాయించామని చెప్పారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని.. ఇంకా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రూ. 3 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చి పలు కంపెనీలతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుఉకు కేంద్రంతో కలిసి పనిచేస్తామన్నారు. మీరు అండగా ఉండండి... ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర, కొండా సురేఖ పాల్గొన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలు.. హెడ్-టు-హెడ్ ఛాలెంజ్ విన్నర్స్ వీరే..

హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు మిస్ వరల్డ్ పోటీలు కీలక దశకు చేరుకున్నాయి. తాజాగా హెడ్–టు–హెడ్ ఛాలెంజ్ గ్రాండ్ ఫినాలే హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్లో వైభవంగా జరిగాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం కోసం 20 మంది కంటెస్టెంట్స్ ఎంపిక అయ్యారు. యూరప్, ఆఫ్రికా, ఆసియా, అమెరికా అండ్ కరేబియన్ ఖండాల నుంచి 20 మంది కంటెస్టెంట్స్ హెడ్–టు–హెడ్ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు.




వారు తమ వ్యక్తిత్వాన్ని, సామాజిక స్పృహను ప్రదర్శిస్తూ, మానసిక ఆరోగ్యం, మహిళా సాధికారత, విద్య, పర్యావరణ సంరక్షణ, సాంస్కృతిక పరిరక్షణ వంటి కీలక విషయాలపై ప్రసంగించారు. ఇందులో మిస్ వేల్స్, మిస్ టర్కీ, మిస్ ట్రినిడాడ్, టొబాగో, మిస్ జాంబియా సుందరీమణులు హెడ్–టు–హెడ్ కాంటినెంటల్ విజేతలుగా ఎంపికయ్యారు. మిస్ వరల్డ్ హెడ్–టు–హెడ్ ఛాలెంజ్ ఫైనల్ నుంచి మిస్ ఇండియా నందిని గుప్తాకు చోటు దక్కలేదు. కాగా, ఈ నెల 31న గ్రాండ్ ఫినాలే జరగబోతుంది. ఆ రోజే ప్రపంచ విన్నర్‌ను ప్రకటిస్తారు.

# మమ్మల్ని విమర్శిస్తే భరిస్తాం.. సైనికులను అధికారులను అవమాన పరచకండి - కిషన్ రెడ్డి



మిస్‌వరల్డ్ అందాల పోటీల పై ఉన్న శ్రద్ధ హైదరాబాద్ అందాలపై లేదని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ విమర్శించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పర్యటనలో భాగంగా శుక్రవారం ఖైరతాబాద్ అసెంబ్లీ, హిమాయత్ నగర్ డివిజన్, బగ్గిఖానా బస్తీని కిషన్ రెడ్డి విజిట్ చేశారు. నూతనంగా నిర్మించిన కమిటీ హాల్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం బస్తీలో పర్యటించి వారి బస్తీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని సూచించారు. హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ మాత్రమే కాదని, హైదరాబాద్ అంటే పాత బస్తీ లోని అనేక ప్రాంతాలు ఉన్నాయని సీఎం మర్చిపోయారని ఆరోపించారు. మరోవైపు సైనికులను అవమాన పరిచే రీతిలో కాంగ్రెస్ నేతలు మాట్లాడటం దురదృష్టకరమన్నారు.

ఆపరేషన్ సింధూ అంటే ఏమిటో ప్రపంచానికి తెలిసింది.. కానీ కాంగ్రెస్ నేతలకు తెలియకపోవడం బాధాకరమని అన్నారు. ప్రధాని మోడీని విమర్శించండి, మమ్మల్ని విమర్శించండి భరిస్తాం.. కానీ సైనికులను అధికారులను అవమాన పరచకండి అది దేశాన్ని అవమానించినట్లే అని ఆవేదన వ్యక్తం చేశారు. సర్జికల్ స్ట్రైక్ పైన ఆధారాలు చూయించాలనీ గతంలో కేసీఆర్, కవితలు అడిగారని గుర్తుకు చేశారు. ఎప్పటికప్పుడు ఆపరేషన్ సింధూర్ పై అప్డేట్ ఇచ్చినప్పటికీ ఆపరేషన్ సింధూర్ పై ఆధారాలు చూపించాలనీ కాంగ్రెస్ నేతలు అడుగుతున్నారని అన్నారు. ఆపరేషన్ సింధూర్ లో ఒక్క విమానం కూలిపోలేదని బలగాలు స్పష్టంగా చెప్పాయని గుర్తుకు చేశారు. ఆపరేషన్ సింధూర్ పై కాంగ్రెస్ నేతలు రాజకీయం చేయడం దురదృష్టకరమని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

# బీఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతం.. మంత్రి కోమటి రెడ్డి కీలక వ్యాఖ్యలు

బీఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతం అయిందని.. వంద జాకీలు పెట్టినా లేవదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో రాజు, యువరాజు ఫొటోలు తప్ప మరెవరివి కనిపించ లేదని కామెంట్ చేశారు. బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థి లేక బీజేపీకి ఓట్లు వేశారని ఆరోపించారు. సాధారణ ఎన్నికల్లో సైతం సిద్దిపేట , సిరిసిల్ల నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు చాలా తక్కువ మెజారిటీతో గెలుపొందారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గురించి ఎవరూ ఆలోచించట్లేదని అన్నారు.

కాళేశ్వరం అనుభంధ ప్రాజెక్టులు మొత్తం కొట్టుకుపోతున్నాయని, మొత్తం 3 డ్యామ్‌లు తీసేయాల్సిందేనని అన్నారు. తాను సివిల్ ఇంజనీరింగ్ చేశానని.. ఆ విషయం తనకు తెలియదా అని అన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రాసిన లేక ఒక జోక్ అయిపోయిందని ఎద్దేవా చేశారు. మాజీ ఎంపీ, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న వ్యక్తి రాసిన లేఖ ఓ పద్ధతిగా ఉందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నేతలే ఆ లేఖను సృష్టించారంటూ కొందరు ఆరోపిస్తున్నారని.. అలా చేయడం తమకు అవసరం లేదన్నారు. అయినా.. కవిత తన తండ్రికి లేఖ రాయడమేంటని, అందులో ప్రస్తావించిన విషయాలనే నేరుగా చెప్పొచ్చు కదా అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ లో ఎలాంటి విబేధాలు లేవని.. పక్కా ప్లాన్ ప్రకారమే అన్ని పార్టీలను గందరగోళం నెట్టేందుకు ఆడుతున్న నాటకమని మంత్రి కోమటిరెడ్డి కామెంట్ చేశారు.

# గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ - కవిత లేఖపై మంత్రి పొన్నం

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ రహస్య ఒప్పందాలు ఇటీవల కాలంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రహస్య ఒప్పందాలు చేసుకున్నాయని మంత్రి ప్రభాకర్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గులాబీ పార్టీకి పూర్తిగా సరెండర్ అయిపోయిందంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో బీజేపీపై కేసీఆర్ ఎలాంటి కామెంట్ చేయకపోవడాన్ని కవిత జీర్ణించుకోలేకపోయిందని, అందుకే అన్ని విషయాలను ఆమె లేఖ ద్వారా బయటపెట్టిందని అన్నారు. కవిత రాసిన లేఖపై కేటీఆర్ తో పాటు హరీశ్ రావు కూడా సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం అన్నారు.

# పాకిస్తాన్ అన్ని షరతులను అంగీకరించాకే రుణమిచ్చాం: ఐఎంఎఫ్



ఇటీవల భారత్‌తో వివాదం ఉన్నప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) పాకిస్తాన్‌కు రుణ సదుపాయం కల్పించడం పట్ల విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజా దీనిపై ఐఎంఎఫ్ వివరణ ఇచ్చింది. పాకిస్తాన్ అన్ని షరతులు, నిబంధనలను అంగీకరించిన తర్వాతే బోర్డు బిలియన్ డాలర్ల సాయన్ని మంజూరు చేసిందని తెలిపింది. మే 9న బోర్డు మొత్తం రుణమిచ్చేందుకు ఆమోదం తెలిపినట్టు ఐఎంఎని కమ్యూనికేషన్ విభాగం డైరెక్టర్ జూలీ కొజక్ చెప్పారు. మీడియా సమావేశంలో మాట్లాడిన ఆమె.. గతేడాది సెప్టెంబర్‌లోనే పాకిస్తాన్‌కు ఇవ్వాల్సిన ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ(ఈఎఫ్‌ఎఫ్) ప్రోగ్రామ్‌కు ఆమోదం లభించిందని, ఆ సమయంలో మొదటి సమీక్ష 2025, తొలి త్రైమాసికంలో నిర్వహించాలని నిర్ణయించినట్టు వివరించారు. సమీక్ష పూర్తయిన తర్వాత తాజా సహాయం మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. అదే సమయంలో, ఈఎఫ్‌ఎఫ్ ప్రోగ్రామ్ షరతుల విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే ప్రోగ్రామ్ కింద భవిష్యత్తులో జరిగే సమీక్షలపై ప్రభావితం ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు రుణాల మంజూరుకు సంబంధించి పురోగతిని అంచనా వేసేందుకు ఎప్పటికప్పుడు సమీక్షణలను నిర్వహిస్తుంది. ఇచ్చిన రుణాలు ప్రోగ్రామ్ పరిధిలోనే జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని ట్రాక్ చేస్తాం. అనుకున్న విధంగా కార్యక్రమం లక్ష్యాలు నెరవేరుతున్నాయా, లోపాలు ఉంటే సరిదిద్దేందుకు విధానపరమైన మార్పులు అవసరమా అనేది పరిశీలిస్తామని చెప్పారు. పాకిస్తాన్ విషయంలోనూ ఇదే జరిగిందని, ఆ దేశం అన్ని లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నందునే బోర్డు రుణం మజూరు చేసిందన్నారు. కొన్ని అంశాల్లో మార్పులు చేసిన కారణంగా బోర్డు ఈఎఫ్‌ఎఫ్ కార్యక్రమాన్ని ఆమోదించింది. పాకిస్తాన్‌కు ఈఎఫ్‌ఎఫ్ కింద ఇచ్చిన అన్ని చెల్లింపులు సెంట్రల్ బ్యాంక్ నిల్వలకు బదిలీ అవుతాయని జూలీ కొజక్ వివరించారు. కాబట్టి చెల్లింపులు బడ్జెట్ ఫైనాన్సింగ్‌లో భాగం కావు, ప్రభుత్వానికి చేరవని వెల్లడించారు.

## రక్షణ పరిశోధన , అభివృద్ధి సంస్థలను ఏపీ లో ఏర్పాటు చేయండి - రాజ్ నాథ్ ను కోరిన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌ను భారత రక్షణ, ఏరోస్పేస్ రంగాల భవిష్యత్తుకు ఒక మూలస్తంభంగా తీర్చిదిద్దే ప్రణాళికలలో భాగంగా థీమాటిక్ డిఫెన్స్ హబ్‌లు, డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ) అనుబంధ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఉత్కృష్టతా కేంద్రాలు) కేంద్రాలను ఏపీ లో ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ ను ఏపీ సిఎం చంద్రబాబు కోరారు.. భారతదేశాన్ని రక్షణ రంగంలో స్వావలంబన దిశగా నడిపించే 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన వివరించారు.. ఈ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో పలు డిఫెన్స్ సంస్థలు ఏర్పాటు చేయాలని, అందుకు తమ ప్రభుత్వం అని విధాల సహకరిస్తుందని తెలిపారు.

ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు నేడు రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో రాజ్ నాథ్ ను కలసి వివిధ ప్రతిపాదనలను అందజేశారు. ఈ భేటీలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ముఖ్యంగా రక్షణ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళికపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన సమావేశం అద్భుతంగా, ఫలవంతంగా సాగిందని తెలిపారు

ఇక రాష్ట్రంలో వ్యూహాత్మక మౌలిక సదుపాయాల కల్పన, విధానపరమైన నూతన ఆవిష్కరణల ద్వారా రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారని, రాష్ట్ర అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ప్రోత్సాహకరమైన స్పందన, మద్దతు పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ఎంతగానో దోహదపడుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.


# మా నాయకుడు కేసీఆరే



'మా నాయకుడు కేసీఆర్ .. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది' అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న ఆమెకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో జాగృతి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.

"వరంగల్ సభ తర్వాత రెండు వారాల క్రితం నా తండ్రి, భారాస అధినేత కేసీఆర్‌కు లేఖ రాశా. నా అభిప్రాయాలు లేఖ ద్వారా స్పష్టం చేశా. అంతర్గతంగా రాసిన లేఖ ఎలా బయటికి వచ్చిందో అర్థం కావడం లేదు. దీని వెనుక ఎవరు ఉన్నారో తెలియదు. నా కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుక పూర్తి చేసుకొని అమెరికా నుంచి వచ్చే లోపు .. లేఖ బహిర్గతం అయిందని, దానిపై హంగామా నడుస్తున్నట్టు తెలిసింది. కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయని మొన్ననే చెప్పాను. నేను అంతర్గతంగా కేసీఆర్‌కు రాసిన ఉత్తరం బహిర్గతం కావడం పార్టీలో ఉన్న అందరం ఆలోచించుకోవాల్సిన విషయం. పార్టీలో ఉన్న నాయకులు అనుకుంటున్న విషయాలే నేను లేఖలో ప్రస్తావించాను. గతంలోనూ నా తండ్రికి అంతర్గతంగా లేఖలు రాశా. కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. మా నాయకుడు కేసీఆర్ .. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది. కేసీఆర్ నాయకత్వంలోనే భారాస పార్టీ ముందుకెళుతుంది. పార్టీలో చిన్న చిన్న లోపాలను చర్చించుకోవాల్సిన అవసరముంది. కోవర్టులను పక్కకు తప్పిస్తే పార్టీ బాగుపడుతుంది" అని కవిత అన్నారు.

# నూతన వధూవరులకు ఝూన్సీరెడ్డి ఆశీర్వాదం



రాయపర్తి, 23 మే(క్రాంతి న్యూస్ ): మండలంలోని పలు గ్రామాలలో వివాహలకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హనుమండ్ల ఝూన్సీ రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.దుబ్బ తండా కు చెందిన శిరీష, రమేష్, గుబ్బడి తండా కు చెందిన ఈషా, సతీష్ వివాహలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, నాయకులు కాంచనపల్లి వనజా రాణి, రెంటాల గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని చంపి బావిలో పడేసిన తల్లి



సిద్దిపేట , 23 మే(క్రాంతి న్యూస్ ): అనుమానమే నిజమైంది. తన బిడ్డ అపహరణకు గురైందని ఫిర్యాదు చేసిన తల్లే.. ఆ చిన్నారిని బలితీసుకున్నది. బాలుడిని తానే బావిలో పడేశానని ఒప్పుకున్న ఘటన సిద్దిపేట జిల్లా అప్పనపల్లిలో చోటుచేసుకున్నది. దుబ్బాక మండలం అప్పనపల్లిలో నివాసం ఉంటున్న శ్రీమాన్, కవిత దంపతులకు రెండు నెలల వయస్సున్న కుమారుడు ఉన్నాడు. ఈ నెల 17న మిరుదొడ్డి మండలం రుద్రారంలో ఉన్నా తన సోదరి ఇంటి వద్ద పని ఉందని శ్రీమాన్ వెళ్లాడు. ఈ క్రమంలో కవిత తన రెండు నెలల కుమారుడితో ఉంటుంది. బుధవారం రాత్రి తన కుమారుడిని ఎత్తుకుని ఆరుబయట ఉండగా, గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మాయ మాటలు చెప్పి, ఒడిలో నుంచి పసికందును అపహరించుకెళ్లారని తెలిపింది. ఈ విషయంపై కవిత తన భర్త శ్రీమాన్‌తో కలిసి దుబ్బాక పోలీసు స్టేషన్‌లో గురువారం ఉదయం ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించారు.

ఇందులో భాగంగా కవితను తమదైన స్టైల్‌లో విచారించగా అసలు విషయం తేలింది. అదేరోజు అప్పనపల్లి శివారు బావిలో బాబును పడేసినట్లు అంగీకరించింది. దీంతో క్రేన్ సహాయంతో బాబు మృతదేహాన్ని పోలీసులు వెలికితీశారు. నిందితురాలిని సిద్దిపేట మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవల కారణంగానే తమ పసికందును హతమార్చి, బావిలో పడేసినట్లు పోలీసు వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఉన్నత చదువుల నుంచి ఉద్యమబాట వైపు..
# 'ఆపరేషన్ కగార్'లో షాద్‌నగర్ యువతి మృతి



రంగారెడ్డి , 23 మే(క్రాంతి న్యూస్ ): రంగారెడ్డి జిల్లా, కేశంపేట మండలం, వేములనర్వ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పన్నెండేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న తమ గ్రామ యువతి విజయలక్ష్మి అలియాస్ భూమిక, ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన 'ఆపరేషన్ కగార్'లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు వార్తలు రావడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. విజయలక్ష్మి ఉన్నత చదువుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడే ఆమె ఉద్యమాలకు ఆకర్షితురాలై, అజ్ఞాతంలోకి వెళ్ళిపోయిందని స్థానికులు చెబుతున్నారు. కుటుంబానికి దూరంగా, ఒక ఆశయంతో పయనించిన ఆమె జీవితం ఇలా విషాదకరంగా ముగుస్తుందని ఎవరూ ఊహించలేదు. సుదీర్ఘ కాలం పాటు కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు దూరంగా ఉన్న విజయలక్ష్మి గురించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అందరూ ఆమె సురక్షితంగా ఉందని ఆశించారు.

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఆపరేషన్ కగార్ వివరాలు, ఎన్‌కౌంటర్ గురించి పూర్తి స్పష్టత లేనప్పటికీ, విజయలక్ష్మి మృతి వార్త మాత్రం వేములనర్వ గ్రామ ప్రజలను తీవ్రంగా కలచివేసింది. పన్నెండేళ్ల క్రితం బయలుదేరిన ఉద్యమ బాట ఆమెను మృత్యువు ఒడిలోకి చేర్చిందని గ్రామస్తులు విలపిస్తున్నారు. విజయలక్ష్మి మృతదేహాన్ని నేడు స్వగ్రామమైన వేములనర్వకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సమాచారం. ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఈ దుర్ఘటనను జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# యూటీ నిర్మాణపనులు వేగంగా చేయాలి: మంత్రి పొంగులేటి



కూసుమంచి, 23 మే(క్రాంతి న్యూస్ ): నాగార్జునసాగర్ ఎడమ కాలువపై చేపట్టిన యూటీ (అండర్ టన్నల్) నిర్మాణ పనులు వేగంగా చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జలవనరుల శాఖ అధికారులకు సూచించారు. గత ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో భారీ వర్షాలు, వరదలతో కుప్పకూలిన యూటీ నిర్మాణపనులను ఇటీవల ప్రారంభించారు. పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి అధికారులతో మాట్లాడుతూ జులై నెలాఖరుకు నిర్మాణం, నీటి విడుదలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. నీటి పారుదల శాఖ ఎస్.ఈ.వెంకటేశ్వర్లు, డీఈఈ పద్మజ, అధికారులు పాల్గొన్నారు.

# మీకు ఎందుకు ఉద్యోగాలు, జీతాలు.. ఏజెన్సీ వైద్యులకు జిల్లా కలెక్టర్ వార్నింగ్..!

భద్రాద్రి కొత్తగూడెం, 23 మే(క్రాంతి న్యూస్ ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిబ్బందిని ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఉద్యోగుల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏజెన్సీలోని ఓ ఆసుపత్రిని పరిశీలించిన జిల్లా కలెక్టర్‌కు చిర్రెత్తుకొచ్చింది. ఇది హాస్పిటలా.. మ్యూజియంలా ఉందంటూ వారికి వ్యంగ్యంగా చురకలు అంటించారు.



బూర్గంపాడు ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్, బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో వైద్యుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. హాస్పటల్ లో నార్మల్ డెలివరీ చేయక పోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.నెల రోజుల్లో పనితీరు మార్చుకోకపోతే బదిలీ చేస్తామంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. గత కొన్ని మాసాలుగా హాస్పిటల్‌లో నార్మల్ డెలివరీలు చేయకపోవడం పట్ల డాక్టర్లను మందలించారు. జీతాలు తీసుకుంటున్నప్పుడు ప్రజలకు సేవ చేయాలి కదా అంటూ మండిపడ్డారు. నెలరోజుల్లో పనితీరు మార్చుకోకపోతే స్టాఫ్ అందరిని బదిలీ చేస్తామంటూ హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్ తనిఖీలు, ప్రశ్నలతో బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బందికి ముచ్చెమటలు పోయించారు. గతంలోనూ విజిట్ చేసి పనితీరు మార్చుకోవాలని సూచించారు. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిపై లాస్ట్ వార్నింగ్ అంటూ హెచ్చరిక చేశారు. జిల్లా కలెక్టర్ పనితీరు పై సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో ఆయనకు నెటిజన్లు పెద్ద ఎత్తున అభినందనలు తెలుపుతున్నారు. శభాష్ కలెక్టర్ అంటూ అభినందిస్తున్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్



కామారెడ్డి , 23 మే(క్రాంతి న్యూస్ ): కామారెడ్డి పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, దోమల వ్యాప్తి అరికట్టేందుకు ఫాగింగ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వార్డ్ నెంబర్ 17, అశోక్ నగర్, స్నేహపురి కాలనీ, తదితర వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో అన్ని వార్డుల్లో నిరంతర పారిశుద్ధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, సహాయ ఇంజినీరు శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

# బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్



జహీరాబాద్ , 23 మే(క్రాంతి న్యూస్ ): జహీరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జహీరాబాద్‌లో పర్యటించిన సీఎం.. హుగ్గెల్లి జంక్షన్‌లో బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాచునూరులో కేంద్రీయ విద్యాలయం భవనాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం పస్తాపూర్ చేరుకున్న సీఎం.. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణంలో రూ.494.67 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2014 తర్వాత నిమ్జ్ అభివృద్ధి కుంటుపడిందని.. భూసేకరణలో అన్యాయం జరిగిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నిమ్జ్‌కు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం పెంచామని చెప్పారు. నిమ్జ్ కోసం భూములిచ్చిన వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. త్వరలోనే 5,612 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు.

నేషనల్ హైవేపై అండర్ పాస్ నిర్మాణాలు చేస్తాం. సింగూరు ప్రాజెక్టును అద్భుతమైన టూరిజంగా తీర్చిదిద్దుతాం. హుండాయ్ కార్ల పరిశ్రమ ఏర్పాటు కాబోతుందని రేవంత్ అన్నారు. జహీరాబాద్ అభివృద్ధి సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తామని.. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏకో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ చెప్పారు.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట.. మరోసారి పోలీసులకు NHRC నోటీసులు



హైదరాబాద్ , 23 మే(క్రాంతి న్యూస్ ): హైదరాబాద్ లోని సంధ్య థియేటర్‌లో డిసెంబర్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై 6 వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ పోలీసులు గతంలో ఇచ్చిన నివేదికలో సరైన వివరాలు లేవని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో అల్లు అర్జున్ నటించిన "పుష్ప 2: ది రూల్" సినిమా ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగి, రేవతి అనే 39 ఏళ్ల మహిళ మరణించగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు.

ఈ ఘటనపై అడ్వకేట్ రామారావు ఇమ్మనేని ఫిర్యాదు చేయడంతో NHRC చర్యలు తీసుకుంది. చిక్కడపల్లి పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, తగిన ఏర్పాట్లు చేయకపోవడం వల్ల ఈ తొక్కిసలాట జరిగిందని, దీనివల్ల రేవతి మరణించి, ఆమె కుమారుడు గాయపడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# కసిరెడ్డికి సుప్రీంలో దక్కని ఊరట



అమరావతి, 23 మే(క్రాంతి న్యూస్ ): ఏపీ మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించలేదు. ఈ కేసులో తన అరెస్టును సవాల్ చేస్తూ రాజ్ కసిరెడ్డి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం జస్టిస్ పార్థివాలా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. కసిరెడ్డి వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. తన కొడుకు అరెస్ట్ సమయంలో నిబంధనలు పాటించడం లేదంటూ కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డి వేసిన పిటిషన్‌ను కూడా తోసిపుచ్చింది.

ఈ రెండు పిటిషన్లపై గత సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈరోజు దానికి సంబంధించిన తీర్పును వెల్లడించింది. అరెస్ట్ సక్రమమా కాదా అనేదానిపై మెరిట్స్‌లో వెళ్లకుండా ఈ కేసును పూర్తిగా డిస్పోస్ చేస్తున్నామని తీర్పులో పేర్కొంది. మద్యం స్కాంలో సీఆర్పీసీ 160 ప్రకారం హైదరాబాద్‌లో ఉంటున్న తనకు నోటీసులు జారీ చేసే అధికారం ఏపీ సీఐడీకి లేదంటూ కసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి పంపించామని.. దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని తెలిపింది. రెగ్యులర్ బెయిల్ వంటి విషయాలు హైకోర్టులో చూసుకోవాలని.. ఈ విషయాలను తాము ప్రస్తావించడం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

అలాగే ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు గతంలోనే నిరాకరించింది. ఆ కేసును కూడా కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డి ఈనెల 9న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. కసిరెడ్డి, కసిరెడ్డి తండ్రి వేసిన పిటిషన్లను రెండు కలిపి జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూత్రా, సిద్ధార్థ అగర్వాల్‌లు వాదించగా.. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు మహేష్ జత్మలానీ, పొన్నవోలు సుధాకర్ రెడ్డి, రమేష్‌లు పాల్గొన్నారు. కసిరెడ్డి తరఫున వాదించిన మహేష్ జత్మలానీ.. కసిరెడ్డి అరెస్ట్ అక్రమమని, సీఆర్పీసీ 160 ప్రకారం మరో రాష్ట్రంలో ఉన్న వ్యక్తికి సమన్లు జారీ చేసే అధికారం ఏపీ సీఐడీ లేదని వాదించారు.

ఏప్రిల్ 21న విచారణకు స్వచ్ఛందంగా హాజరవుతానని చెప్పినప్పటికీ కూడా కసిరెడ్డిని హైదరాబాద్ ఎయిర్‌పోర్టులోనే అరెస్ట్ చేశారని, అరెస్ట్ చేసినప్పుడు లేని సెక్షన్లన్నీ కుట్రపూరితంగా రిమాండ్ రిపోర్టులో చేర్చారని ఆయన వాదించారు. అరెస్ట్ చేసినప్పుడు 409, 420 సెక్షన్ల ప్రకారం అదుపులోకి తీసుకున్నారని, రిమాండ్ రిపోర్టులో మాత్రం అవినీతి నిరోధక చట్టాన్ని చేర్చారని, రాజ్ కసిరెడ్డి ప్రభుత్వ ఉద్యోగిగా లేనప్పటికీ ఆయన గతంలో సీఎంకు ఐటీ సలహాదారుగానే పనిచేశారని.. మద్యం పాలసీతో కసిరెడ్డికి సంబంధం లేదని మహేష్ జత్మలానీ వాదించారు.

అరెస్ట్ సమయంలో ఆయన ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని, కానీ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో మాత్రమే అభ్యంతరాలు వ్యక్తం చేశారని ప్రభుత్వం తరపు న్యాయవాది వాదించారు. ఇరువురి వాదనలు విన్న సుప్రీం కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఆ తీర్పును ఈరోజు వెల్లడించింది సుప్రీం ధర్మాసనం.

# బెజవాడలో బంగ్లాదేశ్ యువకుల కలకలం.. 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు




బెజవాడ , 23 మే(క్రాంతి న్యూస్ ): బెజవాడలో బంగ్లాదేశ్ కు చెందిన యువకుల కదలికలు కలకలం రేపుతున్నాయి. విజయవాడ నగరంతో పాటు తాడిగడప పెనమలూరు పోరంకి ప్రాంతాల్లో సుమారు 15 మంది బంగ్లాదేశ్ లోని మయన్మార్కు చెందిన యువకులు ఉన్నట్టు విజయవాడలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులకు సమాచారం అందింది. 15 మంది యువకుల్లో 8 మంది ఈ ఏడాది జనవరిలో నగరానికి వచ్చినట్టు ఏడుగురు నిన్న రాత్రి వచ్చినట్టు గుర్తించారు.

ఉగ్ర లింకులు రాష్ట్రంలో బయట పడటంతో బంగ్లాదేశ్ యువకుల కదలికలపై పోలీసుల దృష్టి పెట్టారు. మొత్తం15 మందిని అదుపులోకి తీసుకున్నారు బెజవాడ పోలిసులు. నగర పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులుగా వీరు పనిచేస్తున్నట్టు గుర్తించారు. అందర్నీ రహస్య ప్రాంతానికి తీసుకువెళ్లి విచారిస్తున్నారు. వీరిపై కేసులు ఉన్నాయా ఏ కారణాలతో దేశానికి వచ్చారు అనే వివరాలు సేకరిస్తున్నారు.


# వల్లభనేని వంశీని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు



విజయవాడ , 23 మే(క్రాంతి న్యూస్ ): వల్లభనేని వంశీని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. విజయవాడ సబ్ జైలు నుంచి వంశీని కంకిపాడు పోలీస్ స్టేషన్ కు తరలించారు. బాపులపాడులో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో వంశీ పై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులోనే వంశీని 2 రోజులపాటు కోర్టు అనుమతితో విచారించనున్నారు పోలిసులు. పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేసి.. వంశీని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా వల్లభనేని వంశీకి కోర్టు రిమాండ్ విధించింది. ఇప్పటికే వల్లభనేని వంశీ పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే.

# కేంద్రమంత్రులతో భేటీ.. కీలక ప్రతిపాదనలు అందజేసిన సీఎం చంద్రబాబు

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు బిజీ బిజీగా గడుపుతున్నారు. కేంద్రమంత్రులతో వరుసగా సమావేశమవుతూ ఏపీకి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రమంత్రులకు అందజేశారు. రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్తో భేటీ అయిన సీఎం చంద్రబాబు.. ముందుగా ఆపరేషన్ సిందూర్ విజయంపై అభినందనలు తెలిపారు. రక్షణ తయారీ, ఏరోస్పేస్ ఆవిష్కరణల్లో రాష్ట్రం దేశానికి ప్రధాన కేంద్రంగా ఎదగడానికి అవసరమైన వ్యూహాన్ని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కీలక ప్రాంతాల్లో పారిశ్రామిక వృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పరిశోధన సహకారం, వ్యూహాత్మక సంస్థాపనలతో కూడిన సమగ్ర ప్రణాళికను వివరించారు. ఈ ప్రతిపాదనలలో ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ యూనిట్ల అభివృద్ధి, కీలక తయారీ యూనిట్ల పునరుద్ధరణ, స్వదేశీ విమానయాన కార్యక్రమాలకు మద్దతు, టెస్టింగ్, శిక్షణా కేంద్రాల ఏర్పాటు, ప్రత్యేకంగా స్థానికంగా లభించే సామర్థ్యాలను ప్రోత్సహించడానికి తగిన రక్షణ కేంద్రాల సృష్టి ఉన్నాయి. పటిష్టమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, క్రియాశీలక విధాన వాతావరణంతో ఆత్మనిర్భర్ భారత్‌ను రక్షణ ఉత్పత్తి, ఆవిష్కరణల ద్వారా ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర




పోషించడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నొక్కి చెప్పారు.

అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ ను కలిసి పోలవరం–బనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనను సమర్పించారు. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు ద్వారా గోదావరి వరద నీటిని ఆంధ్రప్రదేశ్‌లోని కరవు పీడిత ప్రాంతాలకు మళ్లించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా బొల్లాపల్లి రిజర్వాయర్, లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలు, నల్లమల కొండల గుండా సొరంగాలు వంటి మూడు ప్రధాన భాగాలతో కూడిన నీటి బదిలీ వ్యవస్థ ఉంటుంది. జల్ జీవన్, బ్లూ రివల్యూషన్, మేక్ ఇన్ ఇండియా వంటి జాతీయ మిషన్ల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత దిగువ రాష్ట్రంగా మిగులు జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న హక్కును కూడా ఆయన ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. పోలవరం–బనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను డీపీఆర్ త్వరలో సమర్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పనులను త్వరగా ముందుకు తీసుకెళ్లడానికి తక్షణ అనుమతులు మంజూరు చేయాలని ఆయన అభ్యర్థించారు.

కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ని కలిసిన సీఎం.. పీఎం సూర్యఘర్ యోజన కింద రాష్ట్ర ప్రభుత్వానికి సాయం అందించాలని కోరారు. అలాగే.. రాష్ట్రానికి రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్ కేటాయింపు పై ప్రతిపాదనలను అందించారు. ఎస్సీ, ఎస్టీ గృహాలకు 20 లక్షల సోలార్ ప్యానల్స్, బీసీ గృహాలకు 2 కిలోవాట్ల వరకు అమర్చుకునేలా రూ. 10 వేల సబ్సిడీ అందించాలని విజ్ఞప్తి చేశారు. పునరుత్పాదక ఇంధన వినియోగంలో ఏపీని బెంచ్ మార్క్‌స్టేట్‌గా దేశంలో మార్చేందుకు సహకరించాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు.

# ఏపీలో మరో కొవిడ్ కేసు!



నంద్యాల , 23 మే(క్రాంతి న్యూస్ ): కొవిడ్ కేసులు ఏపీని కలవరపెడుతున్నాయి. తాజాగా నంద్యాల జిల్లాకు చెందిన ఓ మహిళకు కొవిడ్ నిర్ధారణ అయింది. ఆమెని రిమ్స్‌లోని ఐసోలేటెడ్ వార్డులో చేర్చి చికిత్స అందిస్తున్నారు. రిమ్స్‌లో కొవిడ్ బాధితుల కోసం మొత్తం 20 బెడ్లను సిద్ధం చేసినట్లు వైద్య అధికారులు చెబుతున్నారు. కొవిడ్ సోకిన మహిళ స్వస్థలం నంద్యాల జిల్లా చాగలమర్రి. ఆమె వయసు 70 ఏళ్లు. నాలుగు రోజులుగా దగ్గు, జలుబుతో బాధపడుతుండగా వైద్యులు పరీక్ష నిర్వహించిన కొవిడ్‌గా గుర్తించారు. నిన్న విశాఖలో ఓ మహిళలు కరోనా పాజిటివ్‌గా నిర్ధారించిన విషయం తెలిసిందే. కొవిడ్ కేసులు వ్యాప్తి చెందుతుండడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలకు కీలక సూచనలు చేసింది. ప్రజలు గుం పులుగా గుమిగూడ కూడదని, రైల్వే స్టేషన్స్, బస్ స్టేషన్స్, అన్ని పబ్లిక్ స్థలాల్లో కోవిద్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపింది. రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని, 60 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంట్లోనే ఉండాలని పేర్కొంది. దగ్గినపుడు, తుమ్మినపుడు చేతులు అడ్డు పెట్టుకోవాలని.. చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించింది. ఎవరకైనా కరోనా లక్షణాలు కనిపిస్తే క్వారంటైన్లో ఉండాలని.. వైద్యుల సలహాతో మందులు వాడాలని తెలియజేసింది.

# అక్రమాల గురించి వైఎస్ జగన్ మాట్లాడటం హాస్యాస్పదం : మంత్రి ఆనం



నెల్లూరు, 23 మే(క్రాంతి న్యూస్ ): ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత గురువారం మీడియా ముందు చేసిన ఆరోపణలపై టీడీపీ నేతలు, రాష్ట్ర మంత్రులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఈ తరుణంలో తాజాగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలు అని తెలిపారు. జగన్ వ్యాఖ్యలకు మంత్రి ఆనం కౌంటర్ వేశారు. శుక్రవారం నెల్లూరులోని వీఎపీ ఆర్ కన్వెన్షన్‌లో మినీ మహానాడు కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ విషప్రచారాన్ని మనమంతా తిప్పికొట్టాలని మంత్రి ఆనం సూచించారు. వైసీపీ హయాంలో జరగనీ స్కామ్ లేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో స్కామ్ వీరులు జగన్ పక్కనే ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో అక్రమాల గురించి వైఎస్ జగన్ మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. వెన్నుపోటు దినం అనడం ప్రజాతీర్పును అవమానించడమే అని మంత్రి ఆనం పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తోంది అని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, అలసత్వం, అవినీతితో రాష్ట్రం వెనకబడిపోయింది అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రావడంతో ప్రాజెక్టులు, పరిశ్రమలతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి ఆనం తెలిపారు.

# వైసీపీ మునిగిపోయే నావ.. వచ్చే ఎన్నికల్లో ఆరు సీట్లు కూడా రావని వాళ్ల భయం..!




నరసాపురం, 23 మే(క్రాంతి న్యూస్ ): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ.. వచ్చే ఎన్నికలలో ఆ పార్టీకి ఆరు సీట్లు కూడా రావన్న భయం పట్టుకుంది వైసీపీ నేతలకు అని కామెంట్ చేశారు మంత్రి నిమ్మల రామానాయుడు.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు కంటే ఏపీ లిక్కర్స్ స్కాం కేసు చాలా పెద్దదని ఆరోపించారు.. మభ్యపెట్టడం మాయ చేయడం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నైజమని దుయ్యబట్టారు.. రైతులు, వ్యవసాయం గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదని మండిపడ్డారు. ఇరిగేషన్ వ్యవస్థ ను భ్రష్టు పట్టించిన చరిత్ర వైసీపీదే అన్నారు.. త్వరలో గోదావరి జిల్లాలో ఇరిగేషన్ వ్యవస్థను ఆధునికరిస్తామని వెల్లడించారు.. రేడార్ తో సర్వే చేసి డీపీఆర్ రిపోర్టులు సిద్ధం చేస్తున్నాం.. కూటమి ప్రభుత్వం రైతుల పక్ష పాత ప్రభుత్వం ధాన్యం కొని 48 గంటల్లో రైతులు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నాం అన్నారు.. నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలో డ్రైన్ తవ్వక పనులకు శంకుస్థాపన చేసిన ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను వెల్లడిస్తూ.. గత ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు..

# బెయిల్ సులభంగా వస్తే ప్రతి ఒక్కరూ రెచ్చిపోతారు..



న్యూఢిల్లీ, 23 మే(క్రాంతి న్యూస్ ): సజ్జల భార్గవరెడ్డి కి సుప్రీం కోర్టు లో చుక్కెదురైంది. ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ కేసు లో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నజస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్‌తో ధర్మాసనం సూచించింది. సామాజిక మాధ్యమాల దుర్వినియోగం భరించరాని స్థాయికి వెళ్లిందని న్యాయస్థానం పేర్కొంది. ఇలాంటి కేసుల్లో బెయిల్ సులభంగా వస్తే ప్రతి ఒక్కరూ రెచ్చిపోతారని సుప్రీంకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. తప్పు ఎవరు చేసినా తప్పేనని, ఇక్కడ రాజకీయాలు అప్రస్తుతం అని ధర్మాసనం పేర్కొంది. ఎవరు తప్పు చేసినా వ్యవస్థ చర్యలు తీసుకోవడం తథ్యమని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.కాగా సజ్జల భార్గవ్ పిటిషన్‌పై జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్‌తో కూడిన ధర్మాసనం గత గురువారం (ఈ నెల 15వ తేదీ) విచారణ చేపట్టింది. అయితే సీనియర్ న్యాయవాదులు ఎవరు అందుబాటులో లేని కారణంగా ఈ కేసు వాయిదా వేయాలని సుప్రీం ధర్మాసనాన్ని సజ్జల భార్గవ్ తరపు న్యాయవాది కోరారు. అయితే ఎస్సీ, ఎస్టీ కేసు కాబట్టి ట్రయల్ కోర్టుకే వెళ్లాల్సి ఉంటుందని సూచించింది. ఇక్కడ విచారణ కుదరదని తెల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో సీనియర్ న్యాయవాది వాదనల కోసం ఈ కేసును వచ్చే వారానికి ధర్మాసనం వాయిదా వేసింది. సజ్జల భార్గవ్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయింది. ఈ కేసు విచారణ చేపట్టాలని ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ కేసు విచారణ చేపట్టమని ఏపీ హైకోర్టు తెలిపింది. ఆ క్రమంలో ఈ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. దీనిని సవాల్ చేస్తూ సజ్జల భార్గవ్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణకు కింద కోర్టుకు వెళ్లాలని సూచించింది. అంతేకానీ.. సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ విచారణ సాధ్యం కాదని స్పష్టం చేసింది.

# అమ్మా.. నేను దొంగని కాదు, చిప్స్ దొంగిలించలేదు".. 12 ఏళ్ల బాలుడి సూసైడ్ నోట్..

ఇంటర్నెట్ డెస్క్ , 23 మే(క్రాంతి న్యూస్ ): పశ్చిమ బెంగాల్ మేదినీపూర్‌లో 12 ఏళ్ల బాలుడి ఆత్మహత్య అందరితో కన్నీరు పెట్టిస్తోంది. చిప్స్ దొంగిలించాడనే ఆరోపణలపై బహిరంగంగా అవమానించబడటంతో ఆత్మహత్య చేసుకుని మరణించాడు. మరణించడానికి ముందు, తన ఇంట్లో తన తల్లికి ఒక సూసైడ్ నోట్ రాశాడు. "అమ్మా, నేను చిప్స్ దొంగిలించలేదు" అని అందులో పేర్కొన్నాడు. ఇది చూస్తే, ఎంతలా ఆ పసి హృదయం బాధించబడిందో అర్థమవుతోంది. ఈ సంఘటన గురువారం సాయంత్రం పశ్చిమ మేదినీపూర్ జిల్లాలో జరిగిందని పోలీసులు తెలిపారు.

7వ తరగతి చదువుతున్న కృష్ణేందు దాస్ అనే 12 ఏళ్ల బాలుడు చిప్స్ కొనడానికి ఒక దుకాణానికి వెళ్లాడు. అయితే, దుకాణం యజమాని శుభాంకర్ దీక్షిత్ అనే వ్యక్తిని పదే పదే పిలిచినప్పటికీ స్పందించలేదు. పిల్లవాడు "అంకుల్ నేను చిప్స్ కొంటాను" అని పదే పదే చెప్పినా లోపల ఉన్న యజమాని నుంచి స్పందన రాలేదు. ఎవరూ లేరని, తర్వాత డబ్బులు ఇద్దామనే ఉద్దేశ్యంతో బాలుడు షాప్ ఎంట్రీ వద్ద ఉన్న చిప్స్ ప్యాకెట్ తీసుకున్నాడని కుటుంబీకులు చెప్పారు.

అయితే, కొద్ది క్షణాల తర్వాత దుకాణం



యజమాని కృష్ణేందును వెంబడించి, చెంపదెబ్బ కొట్టి, బహిరంగంగా గుంజీలు తీయమని బలవంతం చేశాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి తల్లిని సంఘటనా స్థలానికి పిలిపించి, తిట్టారు. పిల్లవాడు చిప్స్ ప్యాకెట్‌కి డబ్బులు చెల్లించడానికి ప్రయత్నించానని చెప్పినప్పటికీ, అతను అబద్ధం చెప్పాడని ఆరోపించాడు.

ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత, బాలుడు గదిలోకి వెళ్లి తాళం వేసుకున్నాడు. చివరకు అతడిని అపస్మారక స్థితిలో తల్లి, ఇరుగుపొరుగు వారు గుర్తించారు.రూమ్‌లో పరుగుల మందు సీసా ఉండటం, బాలుడి నోటి నుంచి నురగ కారుతుండటంతో, పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు గుర్తించారు. కృష్ణేందును వెంటనే ఆసుపత్రికి తరలించి ఐసియులో చేర్చారు, కానీ కొద్దిసేపటికే అతను మరణించాడు. బాలుడి మరణం తర్వాత దుకాణం యజమాని పారిపోయాడు.

ఆత్మహత్యకు ముందు బాలుడు సూసైడ్ నోట్ రాశాడు. అందులో.."అమ్మా, నేను దొంగను కాదు. నేను దొంగతనం చేయలేదు. నేను వేచి ఉండగా మామయ్య (దుకాణదారుడు) నా దగ్గర లేదు. తిరిగి వస్తుండగా, రోడ్డు మీద పడి ఉన్న కుర్కురే ప్యాకెట్ ను చూసి దాన్ని తీసుకున్నాను. నాకు కుర్కురే అంటే చాలా ఇష్టం. చనిపోయే ముందు ఇవే నా చివరి మాటలు, దయచేసి నన్ను క్షమించండి" అంటూ పేర్కొన్నాడు.

# ఎస్టీల అభ్యున్నతికి కేంద్రం విడుదల చేసిన రూ.300 కోట్లు ఏం చేశారు?



ఆదిలాబాద్, 23 మే(క్రాంతి న్యూస్ ): 'రాష్ట్రంలోని ఆదివాసీలు, గిరిజనుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ పద్దుల కింద విడుదల చేసిన రూ.300.97 కోట్లను ఏం చేశారు? వాటిని గిరిజనేతర కార్యక్రమాలకు దారి మళ్లించారో, అందాల పోటీలకు ఖర్చు చేశారో వెల్లడించాలి' అని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో గురువారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లకు, అత్యంత వెనుకబడిన ఆదివాసీల సంక్షేమం, పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు, ప్రధానమంత్రి ఆదివాసీ ఆదర్శ గ్రామ యోజన సహా ఆర్టికల్ 275 (1) పద్దుల కింద 2024 అక్టోబరు 15 నుంచి 2025 మార్చి 21 వరకు కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.300.97 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం కోసం విడుదల చేయలేదని విమర్శించారు. ఈ నెల 25లోగా కేంద్రం నిధులను నిర్దేశిత పద్దులకు విడుదల చేయకుంటే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని నగేశ్ పేర్కొన్నారు. పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆచరణ సాధ్యంకాని హామీలు ఇవ్వడం తప్ప.. నిధులు విడుదల చేసే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు.

# జగన్‌పై తప్పుడు ఆరోపణలు.. మద్యం అక్రమాలపై ఒక్కొక్కరు ఒక్కో రీతిలో కామెంట్లు..




ఏపీ , 23 మే(క్రాంతి న్యూస్ ): ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో వైఎస్ జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత శైలజానాథ్.. సీఎం చంద్రబాబు అధికార దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించిన ఆయన.. జగన్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మద్యం అక్రమాలపై ఆధారాలు చూపాలని వైఎస్ జగన్ సవాల్ చేశారు.. దీనిపై ఏమీ సమాధానం చెప్పలేక టీడీపీ నేతలు చేతులు ఎత్తేశారని సెటైర్లు వేశారు.. నిజంగా డేటా డిలిట్ చేస్తే దాని వెనుక మొత్తం డిపార్ట్‌మెంట్ ఉన్నట్టే కదా..? అని ప్రశ్నించారు. ఆధారాల్లేవని ఒకవైపు చెప్తూనే మరోవైపు బ్యాక్ఎండ్ లో ఉన్నాయని రాశారు. అంటే బ్యాక్ఎండ్‌లో మీకు కావాల్సినట్టు ఆధారాలు తయారు చేస్తున్నారనే అనుమానం కలుగుతోందన్నారు.

ఇక, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి మద్యం కేసులో ఒక్కొక్కరు ఒక్కో రీతిలో ఆరోపణలు చేశారని ఫైర్ అయ్యారు శైలజానాథ్.. నిజంగా అక్రమాలు జరిగి ఉంటే బేవరేజ్ కార్పోరేషన్ అధికారులందరి మీదా ఎందుకు కేసులు పెట్టలేదు.. అని ప్రశ్నించారు. డిస్టలరీల మీద కూడా కేసులు పెట్టి ఎందుకు విచారణ చేయలేదు..? అని నిలదీశారు. ఆధారాలు లేకుండా కట్టుకథలు చెప్పటం మానాలని సూచించారు. ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు జనాన్ని మోసం చేసినందునే వచ్చే నెల 4వ తేదీన వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నాం అని ప్రకటించారు. నిన్నటి ప్రెస్‌మీట్ లో జగన్ వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత శైలజానాథ్.

# తెలంగాణ సర్కార్‌కు తీపి కబురు.. ఐపీఎస్‌ల సంఖ్య పెంపు




హైదరాబాద్ , 23 మే(క్రాంతి న్యూస్ ): తెలంగాణ సర్కార్‌కు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు రాష్ట్రానికి ఐపీఎస్ క్యాడర్ సంఖ్యను పెంచుతూ గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పుడున్న ఐపీఎస్‌ల సంఖ్య 139 నుంచి 151కి పెరగనుంది. ఇందులో సీనియర్ డ్యూటీ పోస్టులను 83కి పెంచింది. అదేవిధంగా స్టేట్ డిప్యుటేషన్ రిజర్వ్ పోస్టులను 20, సెంట్రల్ డిప్యుటేషన్ రిజర్వ్ పోస్టులను 33, లీవ్ రిజర్వ్, జూనియర్ పోస్టులను 13, ట్రైనింగ్ రిజర్వ్ పోస్టులను 2కు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా అందులో ఐపీఎస్ రిక్రూట్‌మెంట్ రూల్స్-1954లోని 9వ రూల్ కింద ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాల్సిన పోస్టులు 46, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాల్సిన పోస్టులను 105గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# ఆపరేషన్ సిందూర్ సక్సెస్ కావడంపై మోడీకి ముఖేష్ అంబానీ అభినందనలు



ఆపరేషన్ సిందూర్ విజయంపై ప్రధాని మోడీని రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ అభినందించారు. శుక్రవారం రైజింగ్ నార్త్‌స్టేట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ముఖేష్ అంబానీ తన ప్రసంగాన్ని ఆపరేషన్ సిందూర్ విజయం సాధించినందుకు మోడీకి వందనం చేస్తూ ప్రారంభించారు. మోడీ ఉక్కు సంకల్పానికి ఆపరేషన్ సిందరూ నిదర్శనం అని అభివర్ణించారు. ఈ విజయం మోడీ ఉక్కు సంకల్పానికి.. సాయుధ దళాల అసమాన ధైర్యసాహసాలకు ప్రకాశవంతమైన నిదర్శనం అని కొనియాడారు. ఉగ్రవాదం పట్ల భారత్ ఎప్పుడూ మౌనంగా ఉండదని.. మన గడ్డపై, మన పౌరులపై దాడి జరిగితే సహించబోమని మోడీ నాయకత్వం నిరూపించిందన్నారు.


ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడుల్లో 26 మంది హిందువులు చనిపోయారు. 26 మంది కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఈ పరిణామం భారతీయుల హృదయాలను కదిలించింది. దీంతో ప్రధాని మోడీ నాయకత్వంలో పాకిస్థాన్‌పై కఠిన నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాలు నిలిపివేసింది. వీసాలను రద్దు చేసింది. అటారీ సరిహద్దు నిలిపివేసింది. ఇంతలోనే మే 7న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. భారత్ జరిపిన దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాక్ వైమానిక స్థావరాలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో దాయాది దేశం తోక ముడిచి కాల్పుల విరమణకు వచ్చింది. పాక్ అడగడంతో భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ప్రశాంత వాతావరణం నెలకొంది.

# పాకిస్థాన్ సైనిక వ్యవస్థపై విదేశాంగ మంత్రి జైంకర్ తీవ్ర వ్యాఖ్యలు

పాకిస్థాన్ సైనిక వ్యవస్థపై భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దాయాది దేశం సీమాంతర ఉగ్రవాదంలో పాల్గొంటుందని.. ఉగ్రసంస్థలకు మద్దతిస్తుందని మండిపడ్డారు. పాక్ ఆ దేశ ఆర్మీ రెండూ ఉగ్రవాద కార్యకలాపాల్లో నిమగ్నమై ఉందన్నారు. విదేశాల్లో పాక్ చర్యలపై విమర్శలు గుప్పిస్తున్న జైశంకర్.. నెదర్లాండ్స్ మీడియాకు వరుస ఇంటర్వ్యూలు ఉస్తున్నారు. తన గడ్డపై జరుగుతోన్న ఉగ్రవాద కార్యకలాపాల గురించి పాకిస్థాన్‌కు తెలియదనే భావనను మంత్రి తీవ్రంగా ఖండించారు. "ఐక్యరాజ్య సమితి ఆంక్షల జాబితాలోని కరడుకట్టిన ఉగ్రవాదులంతా పాకిస్థాన్‌లోనే ఉన్నారు. పట్టపగలే ఆ దేశంలోని పెద్దపెద్ద నగరాల నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వారు ఎక్కడ ఉంటారో తెలుసు. వారు ఎలాంటి చర్యలకు పాల్పడుతున్నారో అందరికీ తెలుసు. వారి మధ్యలో ఉన్న సంబంధాలు తెలుసు" అని జైశంకర్ ఘాటుగా స్పందించారు.

పహెల్గాం ఉగ్రదాడిపై..

పహెల్గాం ఉగ్రదాడిలో పాక్ తన ప్రమేయం లేదని నటించదవద్దని జైశంకర్ చురకలు అంటించారు. పాక్ ప్రభుత్వం ఉగ్రసంస్థలకు సహకారం అందిస్తోందన్నారు. పాక్ ఆర్మీ సరిహద్దు ఉగ్రవాదంలో పీకల్లోతు కూరుకుపోయిందని మండిపడ్డారు. పాక్ ఉగ్రదాడులు కొనసాగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఉగ్రవాదం, జమ్ముకశ్మీర్ వివాదం భారత్‌కు వేర్వేరు అంశాలని తేల్చిచెప్పారు. పాక్ నుండి ఉత్పన్నమయ్యే ఉగ్రవాద సమస్యకు భారతదేశం కచ్చితమైన ముగింపును కోరుకుంటుందని అన్నారు.



పాక్ ను ఆయన గతంలో"ఉగ్రవాద కేంద్రం"గా అభివర్ణించిన వ్యాఖ్యలపైనా స్పందించారు. అదే నిజమని మరోసారి నొక్కి చెప్పారు. అంతకుముందు కూడా మంత్రి ఘాటుగా స్పందించారు.. పాక్ నేతలు, మరీ ముఖ్యంగా ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌పై జైశంకర్ విమర్శలు చేశారు. "మతం గురించి అడిగి తెలుసుకున్న తర్వాత కుటుంబసభ్యుల ముందే 26 మందిని దారుణంగా హత్య చేశారు. మతపరమైన విభేదాలు సృష్టించడానికి మతం అనే అంశాన్ని ఉద్దేశపూర్వకంగా ముందుకుతెచ్చారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని వెల్లడించారు. కాల్పుల విరమణపై భారత్-పాక్ నేరుగా చర్చలు జరిపాయన్నారు. కాల్పులు ఆగాలంటే వారు (పాక్) నేరుగా తమతో మాట్లాడాలని అమెరికాతో సహా అన్ని దేశాలకు స్పష్టంచేశామని మంత్రి క్లారిటీ ఇచ్చారు.

# వంటకు ఏ ఆయిల్ వాడుతున్నారు..

హెల్త్ న్యూస్ , 23 మే(క్రాంతి న్యూస్ ): చాలా మంది వంట చేసేందుకు రిఫైన్డ్ నూనెలను ఉపయోగిస్తుంటారు. రిఫైన్డ్ పల్లి నూనె, పొద్దు తిరుగుడు విత్తనాల నూనె, బ్రాన్ ఆయిల్‌ను వాడుతారు. కానీ రీఫైన్ చేయబడిన వంట నూనెలు మన ఆరోగ్యానికి మంచివి కావని, గానుగలో ఆడించిన నూనెలను వాడితేనే మంచి జరుగుతుందని వైద్యులు చెబుతుంటారు. రీఫైన్ చేయబడిన నూనెలను ఒక ఉష్ణోగ్రత వద్దకు వేడి చేస్తే వాటిల్లో హానికారక సమ్మేళనాల పరిమాణం పెరుగుతుంది. అలాంటి నూనెలను మళ్లీ మళ్లీ వేడి చేసి వాడితే ఆ సమ్మేళనాల పరిమాణం మరింత పెరిగి అవి మన శరీరంలో చేరి మనకు తీవ్రమైన అనారోగ్యాలను కలగజేస్తాయి. అదే గానుగలో ఆడించిన నూనెలు అయితే అంత త్వరగా సమ్మేళనాలను ఏర్పరచవు. కాబట్టి గానుగలో ఆడించిన నూనెలను వాడాలని సూచిస్తుంటారు. అయితే అలాంటి నూనెల్లో ఆలివ్



నూనె కూడా ఒకటి. సాధారణంగా ఆలివ్ నూనె మనకు రీఫైన్డ్ చేయబడినది లభించదు. దీన్ని గానుగలో ఎలాగైతే తయారు చేస్తారో దాదాపుగా అదే క్వాలిటీతో మనకు లభిస్తుంది. దీన్నే ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ అని కూడా పిలుస్తారు. ఈ క్రమంలో ఇలాంట ఆలివ్ ఆయిల్‌ను వాడితే ఎంతో మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

గుండె ఆరోగ్యానికి..

ఆలివ్ ఆయిల్‌లో 73 శాతం ఓలియిక యాసిడ్ ఉంటుంది. ఇది ఒక మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్. ఇది క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుని క్యాన్సర్ రాకుండా చూస్తుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఆలివ్ నూనెలో పాలిఫినాల్స్, విటమిన్ ఇ, కెరోటినాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లలా పనిచేస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌న నిర్మూలిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. వృద్ధాప్యంలో మతిమరుపు రాకుండా అడ్డుకోవచ్చు.

హైబీపీ తగ్గేందుకు..

ఆలివ్ ఆయిల్‌లో ఓలియోకాంథల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. కనుక ఆలివ్ ఆయిల్‌ను వాడితే నొప్పులను తగ్గిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్, మెటబాలిక్ సింద్రోమ్ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆలివ్ ఆయిల్ రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీని తగ్గిస్తుంది. హైబీపీ ఉన్నవారు ఆలివ్ ఆయిల్‌ను వాడుతుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఆలివ్ ఆయిల్‌ను వాడితే రక్త నాళాల్లో ఏర్పడే క్లాట్స్‌ను కరిగించవచ్చు. దీంతో హార్ట్ ఎటాక్, స్ట్రోక్స్ రాకుండా నివారించవచ్చు. అధిక బరువు సమస్యతో బాధపడుతున్నవారు ఆలివ్ ఆయిల్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇది మెటబాలిజంను మెరుగు పరుస్తుంది. క్యాలరీలను ఖర్చు చేసి కొవ్వును కరిగిస్తుంది. దీంతో బరువు తగ్గుతారు.

టైప్ 2 దయాబెటిస్‌కు..

టైప్ 2 దయాబెటిస్ ఉన్నవారు ఆలివ్ ఆయిల్‌ను వాడుతుంటే ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుందని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. దయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఆలివ్ ఆలివ్ ఆయిల్‌లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇది జీర్ణ వ్యవస్థలో ఉండే పురుగులను నాశనం చేస్తుంది. జీర్ణాశయ అల్సర్లను తగ్గిస్తుంది. ఇలా ఆలివ్ ఆయిల్‌తో అనేక ప్రయోజనాలను పొందవచ్చు. దీన్ని వంటల్లో ఉపయోగించవచ్చు. లేదా నేరుగా రాత్రి పూట ఒక టీస్పూన్ మోతాదులో తీసుకోవచ్చు. లేదా జుట్టు, చర్మానికి కూడా అప్లై చేయవచ్చు. దీంతో శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు.

## మసాలా వంటకాల్లో వాడే బిర్యానీ ఆకులు.. అంత తేలిగ్గా తీసిపారేయకండి..

హెల్త్ న్యూస్ , 23 మే(క్రాంతి న్యూస్ ): బిర్యానీ లేదా మసాలా వంటకాలు అంటే సహజంగానే చాలా మందికి ఎంతో ఇష్టంగా



ఉంటుంది. ఈ వంటకాలను తినేందుకు చాలా మంది ఎంతో ఆసక్తిని ప్రదర్శిస్తుంటారు. అయితే ఈ వంటల్లో బిర్యానీ ఆకులను వేస్తారు. అందువల్లే ఆయా వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. బిర్యానీ ఆకులు కేవలం రుచి, వాసనను అందించడమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా ఇస్తాయి. ఆయుర్వేదంలో పలు ఔషధాల తయారీలోనూ ఈ ఆకులను ఉపయోగిస్తారు. ఈ ఆకులనే తేజ్ పత్తా అని కూడా పిలుస్తారు. ఈ చెట్లను మన ఇంటి పెరట్లో లేదా ఇంటి ముందు కూడా పెంచుకోవచ్చు. బిర్యానీ ఆకులతో అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చు. పలు అనారోగ్య సమస్యలను నయం చేయడంలో ఈ ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి.

జీర్ణ సమస్యలకు చెక్..

బిర్యానీ ఆకును ఒకదాన్ని తీసుకుని దాన్ని నీటిలో వేసి మరిగించాలి. అనంతరం ఆ నీళ్లు గోరు వెచ్చగా ఉండగా వడకట్టి అందులో కాస్త నిమ్మరసం, తేనెను రుచి కోసం కలిపి తాగేయాలి. ఈ నీళ్లను ఒక కప్పు మోతాదులో రోజుకు 2 సార్లు తాగవచ్చు. రోజూ మీరు తాగే టీ, కాఫీలకు బదులుగా ఈ నీళ్లను తాగుతుంటే ఎన్నో లాభాలు కలుగుతాయి. బిర్యానీ ఆకుల నీళ్లను తాగడం వల్ల జీర్ణవ్యవస్థలో పలు ఎంజైమ్‌లు యాక్టివేట్ అవుతాయి. ఇవి జీర్ణ క్రియను మెరుగు పరుస్తాయి. అజీర్తి, కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలను తగ్గిస్తాయి. బిర్యానీ ఆకుల్లో యూజినాల్, మైరిసీన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. కనుక బిర్యానీ ఆకుల నీళ్లను తాగుతుంటే శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆర్థరైటిస్, కండరాల నొప్పులు తగ్గుతాయి.

షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు..

బిర్యానీ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం బిర్యానీ ఆకుల నీళ్లను తాగితే శరీరంలో గ్లూకోజ్ మెటబాలిజం పెరుగుతుంది. ఇన్సులిన్‌ను శరీరం సరిగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. దయాబెటిస్ అదుపులో ఉంటుంది. బిర్యానీ ఆకుల్లో లైనలూల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. మైండ్ రిలాక్స్ అయ్యేలా చేస్తుంది. రాత్రి పూట బిర్యానీ ఆకుల నీళ్లను తాగితే మానసిక ప్రశాంతత లభిస్తుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు.

దగ్గు, జలుబు తగ్గేందుకు..


బిర్యానీ ఆకుల నీళ్లను తాగితే శ్వాసకోశ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. దీని వల్ల దగ్గు, జలుబు, ఫ్లూ నుంచి ఉపశమనం లభిస్తుంది. బిర్యానీ ఆకుల నీళు బాగా వేడిగా ఉన్నప్పుడు అందులో కాస్త జండూబామ్‌ను వేసి ఆవిరి పడుతుంటే సమస్య మరింత త్వరగా తగ్గిపోతుంది. గుండె ఆరోగ్యానికి కూడా బిర్యానీ ఆకులు ఎంతో మేలు చేస్తాయి. ఈ ఆకుల్లో పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. బీపీ సైతం తగ్గిపోతుంది. ఇలా బిర్యానీ ఆకుల నీళ్లను సేవించడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



## తిన్నది గొంతులోకి వచ్చినట్లుంటుందా?

హెల్త్ న్యూస్ , 23 మే(క్రాంతి న్యూస్ ): వంట గదిలోని పోపుల పెట్టెలో వుండే జీలకర్రతో ఎన్నో ఆరోగ్య ప్రయోజానాలు వున్నాయి. జీరా నీరు జీర్ణక్రియ, ఉబ్బరం, గ్యాస్ సమస్య నివారణకు సహాయపడుతుంది. ఇది గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లక్స్ నుండి ఉపశమనం పొందటానికి కూడా సహాయపడుతుంది. జీరా ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాము.తిన్నది గొంతులోకి వస్తున్నట్లు అనిపిస్తే జీరా వాటర్ తాగితే సమస్య తగ్గుతుంది.

జ్ఞాపకశక్తిని వేగవంతం చేయడానికి, జీలకర్రను ఖాళీ కడుపుతో తీసుకోవాలి.మలబద్ధకం సమస్య ఉంటే, ఖాళీ కడుపుతో జీలకర్ర ప్రయోజనకరంగా ఉంటుంది.జీలకర్ర అలెర్జీలు, చర్మానికి సంబంధించిన అనేక సమస్యలను తొలగిస్తుంది. ఖాళీ కడుపుతో జీలకర్ర తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.జీర్ణ సంబంధ బాధలకు సులభమైన, శీఘ్ర నివారణ కోసం జీరా వాటర్ మేలు చేస్తుంది.జీలకర్రలో కాలేయ ఆరోగ్యాన్ని ప్రోత్సహించే జీర్ణ ఎంజైములు ఉత్తేజపరిచే సమ్మేళనాలున్నాయి.



KR TV క్రాంతి
శనివారం 24 మే 2025

# క్రీడలు

epaper.krtvnews.com



## ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్..

### నేడు భారత జట్టును ప్రకటించనున్న బీసీసీఐ..!

స్పోర్ట్స్ న్యూస్ , 23 మే(క్రాంతి న్యూస్ ): ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌కు భారత జట్టును నేడు ప్రకటించే అవకాశాలున్నాయి. జూన్ 20న హెడింగ్లీలో సిరీస్‌తో భారత్ పర్యటనను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ఓల్డ్ ట్రాఫోర్డ్, ది ఓవల్‌లో మ్యాచులు జరుగనున్నాయి. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ముంబయిలో జరిగే విలేకరుల సమావేశంలోనే జట్టును ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. మే 24న లేదంటే 25న ప్రకటిస్తారా? అన్నదానిపై కొంత గందరగోళం నెలకొంది. ఎక్కువగా శనివారమే జట్టును ప్రకటించే అవకాశం ఉందంటూ బీసీసీఐ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా తెలిపింది.



అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ముందుగానే టెస్ట్ జట్టును ఎంపిక చేయాల్సి ఉంటుంది. కానీ, రోహిత్ శర్మ ఈ ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం.. విరాట్ కోహ్లీ సైతం సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఇద్దరు సీనియర్లు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో టెస్ట్ జట్టు ఎంపికను రెండువారాల పాటు వాయిదా వేశారు. ప్రస్తుతం టెస్ట్ కెప్టెన్ రేసులో శుభ్‌మన్ గిల్ ముందున్నాడు. అయితే, జస్ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ సైతం రేసులో ఉన్నారు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ప్లేఆఫ్‌కు చేర్చి.. అందరి ప్రశంసలు అందుకున్నాడు.

శుభ్‌మన్ గిల్, గుజరాత్ టైటాన్స్ ఓపెనింగ్ జోడీ అయిన బీ సాయి సుదర్శన్ నార్తాంప్టన్‌లో ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగే రెండో మ్యాచ్‌కు ముందు ఇండియా 'ఏ' జట్టులో చేరనున్నారు. భారత టెస్ట్ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్ లాంటి ఆటగాళ్లు మే 30న జరిగే మొదటి మ్యాచ్ కంటే ముందే మే 25న ఇతర భారత 'ఎ' జట్టు సభ్యులతో కలిసి ఇంగ్లాండ్‌కు బయలుదేరే అవకాశాలున్నాయి. ఆదివారం సాయంత్రం అరుణ్ జైట్లీ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్-కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ ఆడిన తర్వాత మే 26న ఉదయం భారత 'ఎ' జట్టు సభ్యులైన నితీశ్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, హర్షిత్ రాణా, హర్ష్ దూబే న్యూఢిల్లీ నుంచి ఇంగ్లాండ్‌కు బయలుదేరే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఐపీఎల్‌లో కేకేఆర్, ఎస్ఆర్‌హెచ్ ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే.

## ఇంగ్లండ్ టూర్‌కు ఆ స్టార్ పేసర్ దూరం..?

స్పోర్ట్స్ న్యూస్ , 23 మే(క్రాంతి న్యూస్ ): ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు టీమ్ఇండియా జట్టును శనివారం ప్రకటించనున్నారు. రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. ఎవరికి సారథ్య బాధ్యతలు అప్పగిస్తారన్న విషయం ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఈ సిరీస్‌కు స్టార్ పేసర్ మహమ్మద్ షమీ దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తుండటం టీమ్ఇండియా అభిమానులను కలవరానికి గురిచేస్తోంది.



షమీ టెస్టుల్లో సుదీర్ఘ స్పెల్స్ వేయలేదని బీసీసీఐ వైద్యబృందం యాజమాన్యానికి చెప్పినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. అతడిని జట్టులోకి తీసుకుంటే.. ఐదు టెస్టులూ ఆడే అవకాశాలు చాలా తక్కువని ఆ కథనాల్లో పేర్కొన్నారు. ఇంగ్లండ్ సిరీస్‌కు మరో 20 రోజులే సమయం ఉన్న నేపథ్యంలో ఈ వార్త టీమ్ఇండియాను ఇబ్బందికి గురిచేసేదే. మరోవైపు టెస్టు కెప్టెన్సీ రేసులో ఉన్న బుమ్రా కూడా.. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ వల్ల అన్ని టెస్టులు ఆడే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో టీమ్ఇండియా జట్టును ఎంపిక చేయనున్న సెలక్షన్ కమిటీ ఈ విషయంలో సందిగ్ధంలో పడినట్లు సమాచారం. భారత జట్టు ప్రణాళికలపై కూడా ఇది ప్రభావం చూపించే అవకాశం ఉంది.

"షమీ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున నాలుగు ఓవర్లు వేశాడు. అయితే.. అతడు ఒక రోజులో పది ఓవర్ల కంటే ఎక్కువ ఓవర్లు వేస్తాడా.. అన్న విషయం బోర్డుకు, సెలెక్టర్లకు తెలియదు. ఇంగ్లండ్‌లో టెస్టుల్లో పేసర్లు ఎక్కువ స్పెల్స్ వేసే అవసరం ఉండొచ్చు. మేం ఎలాంటి ఛాన్స్‌లు తీసుకోలేం" అని ఓ బీసీసీఐ అధికారి ఆంగ్ల మీడియాకు తెలిపినట్లు సమాచారం.

ఒకవేళ షమీని పక్కనపెడితే అతడి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌కు లేదా హరియాణా పేసర్ అన్షుల్ కాంబోజ్‌కు అవకాశం లభించవచ్చు. ఇక షమీ 2023 %ఔజ% ఫైనల్ లో ఓవల్‌లో ఆస్ట్రేలియాపై చివరిసారిగా టెస్టు ఆడాడు.

ఇక టెస్టు కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా పోటీలో ఉన్నారు. సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కడం ఖాయం. కోహ్లి, రోహిత్‌ల రిటైర్మెంట్ తర్వాత తొలిసారి భారత జట్టు ఎంపిక జరగనుంది.

## సెమీఫైనల్లో శ్రీకాంత్



స్పోర్ట్స్ న్యూస్, 23 మే(క్రాంతి న్యూస్ ): ప్రతిష్ఠాత్మక మలేషియా మాస్టర్స్ పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ పతకానికి మరింత చేరువయ్యాడు. తనకంటే మెరుగైన ర్యాంకర్లకు చెక్ పెడుతూ వస్తున్న భారత షట్లర్.. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జయకేతనం ఎగురవేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన తొమా జూనియర్ పొపోవ్ ను మట్టికరిపిస్తూ సెమీస్‌కు దూసుకెళ్లాడీ ఈ మాజీ వరల్డ్ నంబర్ 1. దాంతో, ఏడాది తర్వాత అతడు ఒక టోర్నీలో సెమీఫైనల్ ఆడబోతున్నాడు. పస్తుతం 65వ ర్యాంక్‌లో కొనసాగుతున్న శ్రీకాంత్ సంచలన ఆటతో వరుసపెట్టి ప్రత్యర్థులకు చెక్ పెడుతున్నాడు. ప్రీ- క్వార్టర్స్‌లో ఆరో సీడ్‌ను చిత్తు చేసిన అతడు .. ఈసారి 18వ ర్యాంకర్‌ను ఇంటిదారి పట్టించాడు. మూడు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ పట్టు విడవలేదు. తొలి సెట్ తర్వాత ప్రత్యర్థి పుంజుకున్నా తన పోరాట పటిమతో ఆకట్టుకున్న భారత స్టార్ చివరకు 24-22, 17-21, 221-20తో విజేతగా నిలిచాడు. తదుపరి రౌండ్‌లో శ్రీకాంత్‌కు జపాన్‌కు చెందిన యుషీ తనక రూపంలో కఠినమైన సవాల్ ఎదురుకానుంది.పురుషుల సింగిల్స్‌లో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన భారత కుర్రాళ్లు హెచ్ఎస్ ప్రణయ్ , ఆయుశ్ శెట్టి, కరుణాకరన్‌లు ఇంటిదారి పట్టిన విషయం తెలిసిందే. ఇక మహిళల 16వ రౌండ్ డబుల్స్ మ్యాచ్‌లో ప్రేరణా అల్వేకర్, మృణ్మయి దేశ్‌పాండే ద్వయం పోరాటం ముగియగా.. ఒలింపిక్ విజేత పీవీ సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది.

## ప్రో హాకీ లీగ్‌కు భారత జట్టు ప్రకటన



స్పోర్ట్స్ న్యూస్ , 23 మే(క్రాంతి న్యూస్ ): వచ్చే నెలలో జరగనున్న ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ యూరప్ అంచె పోటీల కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) జట్టును ప్రకటించింది. జూన్ 7 నుంచి యూరప్‌లోని అమ్‌స్టెల్‌వీన్, నెదర్లాండ్స్, అంట్వెర్ప్, బెల్జియంలో భారత పురుషుల హాకీ జట్టు మ్యాచ్‌లు ఆడనుంది. దీని కోసం గురువారం 24 మందితో కూడిన జట్టును ప్రకటించింది. జూన్ 7, 9న నెదర్లాండ్స్‌తో, 11, 12న అర్జెంటీనాతో టీమిండియా తపలడుతుంది.

ఆ తర్వాత 14, 15న ఆస్ట్రేలియాతో, 21, 22న బెల్జియంతో మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ ఏడాది ఆరంభంలో భువనేశ్వర్ వేదికగా జరిగిన హాకీ ప్రో లీగ్ అంచె పోటీల్లో 8 మ్యాచ్‌లాడిన భారత్ 5 విజయాలతో 15 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. 'అనుభవజ్ఞులు , యువ ఆటగాళ్లతో జట్టు సమతూకంగా ఉంది. ప్లేయర్లంతా బాగా సాధన చేశారు.

హాకీ ప్రపంచకప్‌నకు అర్హత సాధించే నేపథ్యంలో... ప్రతి పాయింట్ కీలకం కావడంతో అన్నీ మ్యాచ్‌ల్లో విజయాలు సాధించేందుకు ప్రయత్నిస్తాం. పెనాల్టీ కార్నర్‌లను సద్వినియోగం చేసుకునే అంశంలో మరింత దృష్టిపెట్టాం'అని భారత హెడ్ కోచ్ క్రెయిగ్ ఫాల్టన్ అన్నాడు. పరాజయాలను 'డ్రాలుగా... 'డ్రా'లను విజయాలుగా మలచడమే లక్ష్యంగా ఉన్నామన్నాడు.

భారత పురుషుల హాకీ జట్టు

గోల్‌కీపర్స్: కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్,
డిఫెండర్స్: సుమిత్, అమిత్ రొహిదాస్, జుగ్‌రాజ్ సంగ్, నీలమ్ సంజీప్, హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, సంజయ్, యశ్‌దీప్ సివాచ్,

మిడ్‌ఫీల్డర్స్: రాజ్ కుమార్ పాల్, నీలకంఠ శర్మ, హార్దిక్ సింగ్, రాజిందర్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, శంషేర్ సింగ్,

ఫార్వర్డ్స్: గుర్జాంత్ సింగ్, అభిషేక్, శైలానంద్ లక్రా, మన్‌దీప్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, దిల్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్.

# జూన్ నుంచి ఉస్తాద్ బరిలోకి




కథానాయకుడు పవన్ కల్యాణ్ సినిమాల విషయంలో వేగం పెంచారు. చేతిలో ఉన్న చిత్రాల్ని పూర్తి చేయడమే లక్ష్యంగా చిత్రీకరణల్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే 'హరి హర వీరమల్లు'ను పూర్తి చేసి 'ఓజీ' కోసం రంగంలో దిగిన ఆయన.. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్'ను పునఃప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. ఇది జూన్ నుంచి కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనున్నట్లు చిత్ర బృందం హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ప్రకటించింది. ఇది హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న సినిమా. అన్ని రకాల వాణిజ్య హంగులతో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానుంది. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా.. అశుతోష్ రాణా, నవాబ్ షా, అవినాశ్, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# కేన్స్‌లో మెరిసిన ఐశ్వర్య రాయ్



రంగురంగుల దుస్తులు.. రెడ్‌కార్పెట్‌పై సినీతారల హొయలు.. అబ్బురపరిచే సినిమా ప్రదర్శనల మధ్య కేన్స్ చిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. మరో రెండు రోజుల్లో ముగియనున్న ఈ ఫెస్టివల్‌లో తాజాగా బాలీవుడ్ కథానాయిక ఐశ్వర్య రాయ్ రెడ్‌కార్పెట్‌పై మరోసారి హొయలొలికించింది. కొన్నేళ్లుగా కేన్స్‌లో మెరుస్తున్న ఈ భామ ఈసారి భారతీయత ఉట్టిపడేలా.. చీరకట్టుతో నుదుటిన సిందూరం పెట్టుకొని సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. మరోవైపు అందాల తార అదితీ రావ్ హైదరీ కూడా నుదుటిన సిందూరంతో ఎరుపు రంగు చీరలో ఎర్రమందారంలా కేన్స్ చిత్రోత్సవాల్లో సందడి చేసింది. దీంతో వీరిద్దరూ ప్రత్యేకంగా నుదుటిన సిందూరం పెట్టుకొని కనిపించడంతో ఇటీవలే పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు కేన్స్ వేదికగా ఐశ్వర్య, అదితి మద్దతు తెలిపినట్లు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# జూన్ 6న 'గ్యాంబ్లర్స్'..
# పోస్టర్ విడుదల చేసిన టీమ్



మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో కథానాయకుడిగా గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో సంగీత్ శోభన్. ఈ హీరో ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమా జూన్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ ఆసక్తికర పోస్టర్‌ను పంచుకుంది.

ఇందులో సంగీత్ శోభన్ సరసన ప్రశాంతి చారులింగ కథానాయికగా నటించారు. రాకింగ్ రాకేశ్, పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత కీలక పాత్రల్లో నటించారు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దీన్ని నిర్మించారు. నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ సినిమా జూన్ 6న రానున్నట్లు తెలుపుతూ చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. ఇదొక మిస్టరీ ఎంటర్‌టైనర్ అని.. ఇందులోని థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్ట్‌లు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఇది ఆకట్టుకుంటుందన్నారు.

# రెండు వారాల్లో ప్రభాస్ 'ది రాజాసాబ్'
# టీజర్ : నిర్మాత ఎస్‌కేఎన్



పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ . టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే ఈ మూవీ నుంచి తాజాగా ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరో రెండు వారాల్లో రాజాసాబ్ టీజర్ రాబోతుందని బేబి నిర్మాత ఎస్‌కేఎన్ వెల్లడించారు. ఈ విషయాన్ని ఒక మూవీ ఈవెంట్‌లో ఆయన వెల్లడించారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధి కుమార్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.

# తమన్నాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కన్నడిగులు..



మిల్కీ బ్యూటీ తమన్నా ఒకప్పుడు ఓ వెలుగు వెలిగింది. స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సంపాదించుకుంది. బాహుబలి చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా కూడా మారింది. ఆ తర్వాత తమన్నా పలు హిందీ చిత్రాలలో కూడా నటించి అలరించింది. అయితే ఇప్పుడు తమన్నాకి క్రేజీ ఆఫర్ దక్కింది. కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ తయారు చేస్తున్న ప్రఖ్యాత మైసూరు శాండల్ సబ్బులతో పాటు ఇతర ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా తమన్నా నియమించారు. ఈ ఒప్పందం రెండేళ్ల కాలానికి కుదరగా, ఇందుకోసం ఆమెకు రూ. 6.2 కోట్ల భారీ మొత్తం చెల్లించనున్నట్లు తెలుస్తుంది. అయితే తమన్నాని బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేయడం పట్ల కన్నడ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కన్నడలో ఇంత మంది స్టార్స్ ఉండగా, ఆమెని ఎంపిక చేయడం పట్ల కన్నడిగులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటక భారీ, మధ్యతరహా పరిశ్రమల మంత్రి ఎం.బి. పాటిల్ రియాక్ట్ అయ్యారు. తనకు కన్నడ పరిశ్రమపై గౌరవం ఉంది, కాని కేఎస్‌డిఎల్ సంస్థ తమ ఉనికిని దేశ వ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యం పెట్టుకుంది. అందుకే తాము పాన్ ఇండియా సెలబ్రిటీని ప్రచారకర్తగా పెట్టామని అన్నారు. తమన్నా ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ చిత్రాలలో నటిస్తుంది. జాతీయ స్థాయిలో ఆమెకి గుర్తింపు ఉంది కాబట్టి అలాంటి వ్యక్తిని బ్యాండ్ అంబాసిడర్‌గా పెట్టుకుంటే తమ ప్రొడక్ట్‌ని మరింత విస్తరించవచ్చు. తమన్నా హై ప్రొఫైల్ బ్యూటీ, స్కిన్ కేర్ బ్రాండ్‌లకి బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా పని చేశారు.

తనకి అనుభవం ఉంది కాబట్టి ఆమె ద్వారా దక్షిణాది రాష్ట్రాలకి వ్యాప్తి చేయవచ్చు. మార్కెటింగ్ నిపుణుల నుండి వచ్చిన ఫీడ్ బ్యాక్ ద్వారానే తమన్నాని ఎంపిక చేశాం అని వివరణ ఇచ్చారు. తమన్నా ఈ మధ్యకాలంలో సినిమాల స్పీడ్ తగ్గించింది అనే చెప్పాలి. తెలుగు, తమిళ్ తో పాటు బాలీవుడ్ లో అడపాదడపా సినిమాలు చేస్తూ అలరిస్తుంది. తెలుగులో రీసెంట్ గా ఓదెల 2 సినిమాలో నటించింది. ఈ సినిమా మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ సినిమాలో తమన్నా అఘోర పాత్రలో కనిపించి మెప్పించింది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీలో స్ట్రీమ్ అవుతుంది. ఇక పలు వెబ్ సిరీస్‌లలో కూడా తమన్నా నటిస్తూ సందడి చేస్తుంది.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com